నిఘా వలయంలో నియోజకవర్గం

- రేపు ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా భద్రతా పర్యవేక్షణ
- జనవరి 16వ తేదీ నుంచి 17 కార్డెన్ సెర్చ్‌లు
- 121 ద్విచక్ర వాహనాలు, రెండు బొలెరో, ఒక కారు, ఆరు ఆటోలు సీజ్
- 10 మందిపై బైండోవర్ కేసులు, 78 మందికి నోటీసులు
- నియోజకవర్గంలో 35 సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట భద్రత
- నాలుగు చెక్‌పోస్టుల్లో పోలీస్ పికెటింగ్.. 90 మంది ఏఆర్ పోలీసులతో విధులు
- ఈనెల 6వ తేదీ వరకు 144 సెక్షన్, 30 పోలీసుయాక్ట్ అమలు
- ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా పేల్చడం నిషేధం – డీఎస్పీ శివనారాయణ స్వామి



కౌంటింగ్ నేపథ్యంలో సీఐ, ఎస్‌ఐలతో డీఎస్పీ శివనారాయణస్వామి సమావేశం

ఆదోని అర్బన్: ఈనెల 4వ తేదీన జరగనున్న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రత చేపట్టారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా మరింత పెంచారు. కార్డెన్ సెర్చ్‌లు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, పేలుడు పదార్థాల కోసం ముమ్మరంగా వేట కొనసాగిస్తున్నారు. సమస్యాత్మక గ్రామాలతో పాటు ప్రతి పట్టణంలోనూ సాయుధ బలగాలతో కవాతు చేపట్టి ఎవరైనా అల్లర్లకు పాల్పడితే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు.

నియోజకవర్గంలో 35 సమస్యాత్మక ప్రాంతాలు

ఆదోని నియోజకవర్గంలో 35 సమస్యాత్మక ప్రాంతాలను పోలీసులు గుర్తించారు. అందులో 17 గ్రామాలు, 18 పట్టణంలోని ప్రాంతాలను గుర్తించి పటిష్టమైన భద్రతా చర్యలను చేపట్టేందుకు రంగం సిద్ధం చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్ల కదలికపై పోలీసులు నిఘా పెంచారు. అలాగే పట్టణం, పల్లె అనే తేడా లేకుండా తిరుగుతూ ప్రశాంత జీవనం గడపాలని, ఎవరైనా గొడవలకు దిగితే చర్యలు కఠినంగా ఉంటాయని వారికి కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరిస్తున్నారు. అదే విధంగా పటిష్ట భద్రత కోసం పోలీసు బలగాలతో పాటు పోలీసు పికెటింగ్, 90 మంది ఆర్మ్‌డ్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే 10 మందిపై బైండోవర్ కేసులు, మరో 70 మందికి నోటీసులు అందజేశారు.

121 వాహనాలు స్వాధీనం

జనవరి 16వ తేదీ నుంచి ఇప్పటివరకు 17 కార్డెన్ సెర్చ్‌లు చేపట్టారు. కౌంటింగ్ సమయం సమీపించడంతో ఈ వారంలోనే వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో 5 కార్డెన్ సెర్చ్‌లు చేపట్టి ఎలాంటి రికార్డులు లేని 121 టూవీలర్ మోటార్‌సైకిళ్లు, 2 బొలెరో, ఒక కారు, ఆరు ఆటోలను సీజ్ చేశారు. నేర చరిత్ర కలిగిన వారి ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అలాగే 110 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 4 వేల లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు.



కార్డెన్ సెర్చ్‌లో పట్టుబడిన వాహనాలు (ఫైల్)

6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలు

ఆదోని నియోజకవర్గంలో ఈనెల 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు 144 సెక్షన్, 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుంది. విజేతలు గానీ, వారి అనుచరులు గానీ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి వీలు లేదని డీఎస్పీ శివనారాయణస్వామి స్పష్టం చేశారు. బాణసంచా కాల్చరాదన్నారు. గుంపులు గుంపులుగా ఉంటూ మాట్లాడుకోవడం, సమావేశాలను ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. ఫలితాలు వెల్లడయ్యే రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బలగాలను సిద్ధం చేశాం. 35 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ పటిష్ట భద్రతను ఏర్పాటు చేశాం. కౌంటింగ్ రోజు ఎవరూ బయటికి రావొద్దు. ఇళ్లల్లోనే టీవీల్లో ఓట్ల లెక్కింపును చూడాలి. బయటకు వచ్చి గుంపులుగుంపులుగా సమావేశాలు చేయరాదు. 144 సెక్షన్, 30 పోలీసుయాక్ట్ అమల్లో ఉంటుంది. విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు చేయవద్దు. ఉత్తర్వులను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు.

– శివనారాయణస్వామి, ఆదోని డీఎస్పీ

నాలుగు చెక్‌పోస్టులు

కౌంటింగ్ రోజున అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పట్టణంలోకి ఎవరూ రాకుండా పటిష్ట భద్రత కోసం అదనంగా నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆస్పరి రోడ్డు వైపీఆర్ దగ్గర, ఆలూరు రోడ్డులోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆర్చ్ దగ్గర, సిరుగుప్ప రోడ్డు వద్ద, ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు వద్ద మొత్తం నాలుగు చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

144 సెక్షన్ నిబంధనలు ఇలా..

- ఐదుగురు వ్యక్తులతో చట్టవిరుద్ధమైన సమావేశాలు చేయరాదు.
- ఏ విధమైన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని బహిరంగంగా ప్రదర్శించకూడదు.
- ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన పూర్తయ్యే వరకు, పూర్తయిన తర్వాత ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలు, నినాదాలు, సంబరాలు చేయరాదు. లౌడ్ స్పీకర్లు ఉపయోగించరాదు.
- పార్టీ జెండాలు, కర్రలతో ఉండడం, బాణసంచాలు పేల్చడం నిషేధం.
- ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై ఎన్నికల కోడ్ ప్రకారం చర్యలు తప్పవు.

క్లుప్తంగా

కౌంటింగ్ వేళ సంయమనం పాటించాలి



ఆటోలో మైకు ద్వారా ప్రచారం చేస్తున్న పోలీసులు

ఆదోని అర్బన్: ఆదోని సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసర్ వారి పర్యవేక్షణలో నియోజకవర్గ ప్రజలందరికీ ఈనెల 4వ తేదీన జరగబోయే ఓట్ల లెక్కింపు సందర్భంగా సంయమనంతో వ్యవహరించాలని ఆదోని టూటౌన్ సీఐ గోపి ప్రజలకు సూచించారు. ఆయన ఆదివారం ఆటోలో మైకు సెట్ ఏర్పాటు చేసి వీధుల్లో తిరుగుతూ 144 సెక్షన్ అమలుపై ప్రజలకు వివరించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సమన్వయం పాటించాలన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

గోనెగండ్ల: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి హెచ్చరించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందుల షాపుల ముందు నిల్వ, ధరలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ అధికారుల నుంచి స్టాకు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు ధ్రువీకరించుకోవాలని సూచించారు. విత్తనాలకు సంబంధించి సోర్స్ సర్టిఫికెట్, ఇతర వివరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన ఉత్పత్తులకు తప్పనిసరిగా రసీదు తీసుకొని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.

సాహిత్య పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న గద్వాల సోమన్న

మంత్రాలయం: పెద్దకడబూరు మండలంలోని కంబదహాళ్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రముఖ బాల సాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన ముడు పుస్తకాలను ఆదివారం ఆవిష్కరించారు. ఆయన రచించిన చిలక పలుకులు, స్వాగతాలు, జ్ఞాపకాల దొంతరలు అనే మూడు పుస్తకాలను ఆదివారం హైదరాబాద్‌లోని కళాభారతిలో వాల్మీకి సేవా సంస్థ ఆధ్వర్యంలో ట్యాగ్ లైన్ కింగ్ డాక్టర్ ఆలపాటి లక్ష్మీనారాయణ, కళారత్న బిక్కి కృష్ణ, విశ్రాంత అటవీశాఖ అధికారి కృష్ణారెడ్డి, విశ్రాంత భూగర్భ గనుల శాఖ డైరెక్టర్ వీడీ రాజగోపాల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత గద్వాల సోమన్నను పలువురు అభినందించారు.

శ్రీమఠంలో యాదగిరి ఎన్నికల పరిశీలకుడు



మంచాలమ్మకు హారతులు పడుతున్న విజయసింగ్ రాజ్‌పుత్

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై కర్ణాటకలోని యాదగిరి ఎన్నికల పరిశీలకుడు విజయసింగ్ రాజ్‌పుత్ ఆదివారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా ఆయన గ్రామ దేవతకు మంచాలమ్మకు హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూలబృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలుకే..



వీరంపల్లిలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గోనెగండ్ల: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ప్రజా తీర్పు ఎలా ఉన్నా ప్రతిఒక్కరూ గౌరవించాలని సీఐ రామకృష్ణయ్య అన్నారు. ఈనెల 4వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకొని ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో సీఐ ఆధ్వర్యంలో పోలీసులు ఆటోల ద్వారా వీధుల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సీఐ రామకృష్ణయ్య మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రజా తీర్పును అందరూ గౌరవించాలన్నారు. దీనిని వ్యతిరేకించి గొడవలు, అల్లర్లకు దిగితే సహించేది లేదన్నారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవాలు, ర్యాలీలు, బాణసంచా కాల్చడానికి అనుమతులు లేవని వివరించారు. అలాగే కేక్ కటింగ్, పార్టీ కార్యాలయాల వద్ద గుమికూడడం లాంటివి చేయరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తూ రోడ్లపైకి వస్తే చర్యలు తప్పవన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే గెలవాలని ప్రార్థనలు



సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న సంఘ పెద్దలు

మంత్రాలయం: స్థానిక ఎమ్మెల్యేగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసిన వై.బాలనాగిరెడ్డి నాల్గవసారి గెలుపొందాలని సీఎస్ఐ సంఘం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం పెద్దకడబూరు మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ ముత్తు మనోహర్ బాబు ఆధ్వర్యంలో ముక్రన్న, ఆర్లప్ప నేతృత్వంలో ప్రార్థనలు చేపట్టారు. ప్రజల ఆశీస్సులతో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన బాలనాగిరెడ్డి నాల్గవసారి కూడా విజయం సాధించాలని ప్రార్థనలు చేపట్టారు.

మోస్తరు వర్షం



ఆలూరులో కురుస్తున్న వర్షం

ఆలూరు రూరల్: వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. శనివారం రాత్రి ఆలూరు మండలంలో మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు ఉగ్రరూపం దాల్చగా.. సాయంత్రం ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. దీంతో కొంత మేర వాతావరణం చల్లబడింది. ఈదురు గాలులు లేకపోవడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. ఈ వర్షంతో రైతుల్లో ఆనందం నెలకొంది. వర్షం రాకతో ఖరీఫ్ దుక్కులు మరింత వేగంగా సాగుతున్నాయి.

కర్ణాటక మద్యం పట్టివేత



మద్యంను చూపుతున్న సెబ్ ఎస్ఐ సత్యనారాయణ

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని మంత్రాలయం మండలంలో కర్ణాటక మద్యంను పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. ఆదివారం ఆదివారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో పట్టుబడిన మద్యంను మీడియాకు చూయించారు. ఆయన మాట్లాడుతూ మంత్రాలయం మండలం కగ్గల్ క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం కలిగి ఉన్న కగ్గల్‌కు చెందిన బోయ రవిని అరెస్ట్ చేసి 230 (90 ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.15 వేలు ఉంటుందని తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. సర్కిల్ పరిధిలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసినా తన సెల్ నెంబర్ 94409 02579కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. తనిఖీల్లో కర్నూలు సెబ్ డీటీఎఫ్ సీఐ నర్సానాయుడు, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు ఓట్ల లెక్కింపు ఇలా..

- నియోజకవర్గంలో 271 కేంద్రాల్లో జరిగిన పోలింగ్
- 14 టేబుళ్లు, 20 రౌండ్లలో తేలనున్న ఫలితం

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలకు సంబంధించి మంగళవారం జిల్లా కేంద్రంలోని రాయలసీమ యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు జరగనుంది. 14 టేబుళ్లలో 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తికానుంది. చివరి రౌండ్‌లో అభ్యర్థి గెలుపు తేలనుంది. నియోజకవర్గంలో ఎమ్మిగనూరు పట్టణంతో పాటు ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల్లో 2,47,752 మంది ఓటర్లుండగా వారిలో 2,03,086 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో 1,01,914 మంది పురుషులు, 1,01153 మంది మహిళలు, ట్రాన్స్‌జెండర్లు 19 మంది ఉన్నారు.

ఎమ్మిగనూరు నియోజకవర్గానికి రౌండ్ల వారిగా కౌంటింగ్ వివరాలు

రౌండ్	పోలింగ్ బూత్‌లు	లెక్కించనున్న ఓట్లు	రౌండ్	పోలింగ్ బూత్‌లు	లెక్కించనున్న ఓట్లు
1	1 నుంచి 14 బూత్‌లు	9,582	11	140 నుంచి 153	9,980
2	14 నుంచి 28	10,657	12	154 నుంచి 167	9,428
3	28 నుంచి 42	9,615	13	168 నుంచి 181	10,803
4	43 నుంచి 56	10,023	14	182 నుంచి 195	10,876
5	57 నుంచి 70	11,159	15	196 నుంచి 209	11,483
6	71 నుంచి 84	9,795	16	210 నుంచి 223	11,116
7	85 నుంచి 98	9,621	17	224 నుంచి 237	9,429
8	99 నుంచి 111	10,897	18	238 నుంచి 251	10,098
9	112 నుంచి 125	11,835	19	252 నుంచి 265	10,865
10	126 నుంచి 139	10,907	20	266 నుంచి 271	4,917

ఎన్నికల ఫలితాలపై జోరు చర్చ

ఆదోని సెంట్రల్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై అటు పట్టణంలోనూ, పల్లెల్లోనూ విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. ఓట్ల లెక్కింపునకు ఒక రోజు గడువు మాత్రమే ఉండడంతో ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ నెలకొంది. ఇద్దరు ముగ్గురు ఒక చోట చేరితే విజయం ఎవరిని వరిస్తుందోననే అంశంపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటమిలపై పలువురు పందేలకు దిగుతున్నారు. కొందరు రూ.5 లక్షల వరకు పందెం కాసినట్లు తెలుస్తోంది. మరొక్కరోజు ఆగితే మంగళవారం అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదోని నియోజకవర్గంలో 2,63,058 మంది ఓటర్లు ఉండగా అందులో 1,75,064 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రేపే కౌంటింగ్

ఓట్ల లెక్కింపుకు ఒక్కరోజే గడువు మిగిలింది. కర్నూలు రాయలసీమ యునివర్సిటీలో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు ఓట్లను లెక్కించనున్నారు. ఆదోని నియోజకవర్గంలోని 265 పోలింగ్ బూత్‌లకు గాను 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రారంభిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ఓట్లు లెక్కిస్తారు. పోలింగ్ సరళిని బట్టి అధికార, విపక్షాల అభ్యర్థులు తమ అనుచరులతో కలసి గ్రామాలు, వార్డుల వారిగా తమకు వచ్చే ఓట్లపై లెక్కలు వేసుకుంటున్నారు. ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తున్న కొద్దీ ఉత్కంఠ పెరుగుతోంది. కౌంటింగ్ రోజు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. పట్టణాల్లో అయినా, గ్రామాల్లో అయినా నలుగురు ఒక చోట చేరితే ఎన్నికల ఫలితాలపైనే చర్చలు ఏ పార్టీ అధికారంలోకి రావచ్చు, ఎవరికి ఎంతెంత మేజార్టీ వస్తుందనే చర్చలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఒక్కోసారి ఈ చర్చలు శృతిమించి వాగ్వాదానికి దారితీస్తున్నాయి. దీంతో పోలీసు అధికారులు ఈ నెల 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఫలితాలపై ఎక్కడా ర్యాలీలు, సంబరాలు, బాణసంచాలు పేల్చడం వంటివి చేయరాదని ఆదేశాలు జారీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

మద్దికెర: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని.. అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. గ్రామాల్లో అపరిశుభ్రత వల్ల అంటురోగాలు ప్రబలే ప్రమాదముందన్నారు. అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎండలకు ఎక్కువగా తిరగరాదని, పనులు చేసేవారు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని సూచించారు. నీటిని వేడి చేసి తాగితే మంచిదన్నారు.

144 సెక్షన్, పోలీస్ యాక్ట్ అమలు



మాట్లాడుతున్న డీఎస్పీ బి.సీతారామయ్య

ఎమ్మిగనూరురూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.సీతారామయ్య హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో డీఎస్పీ మాట్లాడుతూ.. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు జరుపుకోరాదన్నారు. 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని చెప్పారు. ఏ చిన్న తప్పు జరిగినా తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో 37కు పైగా సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు చెప్పారు. ఈ గ్రామాల్లో పీస్ కమిటీలు, ఇరు పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి ప్రశాంతంగా ఉండేలా సూచించామన్నారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేస్తామని, మొబైల్ పార్టీలు గస్తీలో ఉంటాయని వివరించారు. గ్రామాల్లో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చినా, సంచరిస్తున్నట్లు అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పట్టణ, రూరల్ సీఐలు మధుసూదన్‌రావు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు కళకళ



నాడు - పల్లెపాడు వద్ద గుంతలమయంగా రోడ్డు



నేడు - రాకపోకలకు సౌకర్యంగా నిర్మించిన తారు రోడ్డు

కోసిగి: గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రగతికి బాటలు వేశారు. మాలపల్లి నుంచి పల్లెపాడు, చింతకుంట గ్రామాల మీదుగా కోసిగి వరకు పాతికేళ్లుగా రోడ్డు వసతి లేక కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం చేయలేక ప్రజలు నరకయాతన అనుభవించారు. పాతికేళ్లుగా ప్రభుత్వాలు మారుతున్నా ఆ రోడ్డుకు మోక్షం కలుగలేదు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో టెండర్లు ద్వారా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోయినా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని ప్రత్యేక నిధులు రూ.3 కోట్లు వెచ్చించి మాలపల్లి నుంచి కోసిగి వరకు 9.2 కి.మీ రోడ్డు నిర్మాణాన్ని పీటీఆర్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో పూర్తి చేశారు.

డి.బెళగల్ రోడ్డు కళకళ

మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామం రచ్చుమర్రి వరకు 6 కిలోమీటర్ల రోడ్డు గుంతలమయంగా మారి అధ్వానంగా ఉండేది. హైబ్రిడ్ పాక్ట్ రోడ్డు కింద రూ.2.50 కోట్ల బడ్జెట్‌తో పనులు వేగవంతంగా చేసి పూర్తి చేశారు. దీంతో రోడ్డు సుందరంగా తయారైంది. డబుల్ రోడ్డు పనులు చేయడంతో ప్రయాణికులు ఇబ్బంది లేకుండా ప్రయాణం చేస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నాడు - గుంతలమయంగా ఉన్న డి.బెళగల్ రోడ్డు



నేడు - రూపుదిద్దుకున్న తారురోడ్డు

10 నుంచి కేవీపీఎస్ దళితవాడల సందర్శన



మాట్లాడుతున్న ఆనందబాబు

కౌతాళం: దళితపేటల సమస్యలను తెలుసుకునేందుకు ఇంటింటికీ వెళ్లి సామాజిక స్పృహ కల్పించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు అన్నారు. కౌతాళంలో ఆదివారం ప్రజా సంఘాల కార్యాలయంలో కేవీపీఎస్ మండలాధ్యక్షుడు చిన్న మారయ్య అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కేవీపీఎస్ కార్యకర్త దళితవాడల్ని సందర్శించాలని పిలుపునిచ్చారు. దళితులపై దాడులు జరుగుతునే ఉన్నాయని, వాటిని అరికట్టాలన్నారు. దళితుల హక్కుల సాధనకు ఐక్యతతో పోరాటం తప్ప వేరే మార్గం లేదన్నారు. అందుకే ఈ నెల 10వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి కేవీపీఎస్ కార్యకర్త దళితపేటను సందర్శించి సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రతి కుటుంబానికి సామాజిక చైతన్యాన్ని కల్పించి ఉద్యమించేందుకు సిద్ధం చేయాలన్నారు. మండల కార్యదర్శి తాయప్ప, ఉపాధ్యక్షుడు ఉరుకుంద వీరేష్, తాయప్ప, జయరాం, ఆదాం, లింగప్ప, ఈరన్న, ఈరప్ప, వీరేష్ పలువురు పాల్గొన్నారు.

ముమ్మరంగా కార్డెన్ సెర్చ్

ఆదోని అర్బన్: స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాల్మీకినగర్, బోయగేరి ప్రాంతాల్లో ఆదివారం ట్రైనీ డీఎస్పీ ధీరజ్, ఆదోని వన్ టౌన్ సీఐ తేజమూర్తి ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కూడా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. నలుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండరాదని, అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫలితాలు వెలువడిన తర్వాత సంబంధిత రాజకీయ పార్టీల వారు టపాసులు, బాణసంచా పేల్చరాదని, గుంపులుగా ఉండకూడదని, డీజేలతో ఊరేగింపులు చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత రెండు రోజుల వరకు పెట్రోల్, డీజిల్‌ను బాటిళ్లలో అమ్మరాదని షాపుల యజమానులకు సూచించారు.



అనుమానితుల ఇళ్లలో సోదాలు చేస్తున్న సీఐ తేజమూర్తి